ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 12-1-2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రైతు భరోసా పథకం మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.
2. తెలంగాణ చేనేత అభయ హస్తం హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
3. జిల్లాల నుంచి హైదరాబాద్ కు వలస వచ్చిన వారికి కూడా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
4. స్వామి వివేకానంద జయంతి సందర్బంగా ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా యువజన దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

-----------------------

**రైతు భరోసా**

రైతు భరోసా పథకం 2025 మార్గ దర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రైతులకు సంబంధించిన అంశంలో పూర్తి స్పష్టత ఉండాలన్న ఉద్దేశంతో తెలుగులో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 26వ తేదీ నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని, ఏడాదికి ఎకరాకు 12 వేల రూపాయల పంట పెట్టుబడి సాయాన్ని అందిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటి వరకు ధరణి పోర్టల్లో

నమోదు అయిన వ్యవసాయ యోగ్యమైన భూ విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతు భరోసా సాయం అందిస్తామని, వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా నుంచి తొలగిస్తామని స్పష్టం చేసింది. అటవీ హక్కుల చట్టం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులు కూడా రైతు భరోసాకు అర్హులని ప్రభుత్వం తెలిపింది. వ్యవసాయ శాఖ సంచాలకులు అమలు చేసే రైతు భరోసా పథకానికి నేషనల్ ఇన్ ఫర్మేటిక్స్ సెంటర్ ఐటీ భాగస్వామిగా వ్యవహరిస్తుంది. జిల్లాల్లో రైతు భరోసా పథకం అమలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు బాధ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

**(DESK)**

-----------------------------

**పొంగులేటి**

రైతుభరోసా, భూమిలేని నిరుపేదలకు రూ.12వేలు, తెల్లరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున అమలులోకి తెస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థికస్థితి మెరుగుపడ్డాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా ఏడాదికి 15వేల రూపాయల చొప్పున ఇస్తామని మంత్రి ఖమ్మం లో చెప్పారు. భూమిలేని పేదలకు ఏడాదికి 12వేల రూపాయలను రెండు విడతలుగా 6వేల చొప్పున జనవరి 26 నుంచి అమలు చేస్తామన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మోడల్ ఇండ్ల నిర్మాణాలను

చేపట్టామని ఆయన చెప్పారు. ధరణి స్థానంలో ప్రవేశపెట్టిన భూ భారతిని ఫిబ్రవరి చివరిలోపు పూర్తి స్థాయిలో అమల్లోకి తెస్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

**(DESK)**

----------------------------

**పొన్నం ప్రభాకర్**

రేషన్ కార్డుల జారీకి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 16 నుంచి 20 వరకు క్షేత్ర స్థాయిలో లబ్దిదారుల పరిశీలన జరుగుతుందని 21 నుంచి అర్హులైన వారి డేటా ఎంట్రీ చేస్తామని ఆయన ఈ రోజు హైదరాబాద్ లో విలేకరుల సమావేశంలో చెప్పారు. రేషన్ కార్డులకు గతంలో ఉన్న నిబంధనలే వర్తిస్తాయని కొత్త నిబంధనలు పెట్టడంలేదని స్పష్టం చేశారు. జిల్లాల నుంచి హైదరాబాద్ కు వలస వచ్చిన వారికి కూడా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రభాకర్ తెలిపారు.

**డెస్క్**

---------------------------------

**చేనేత అభయ హస్తం**

చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ చేనేత అభయ హస్తం పథకం పేరుతో మూడు పథకాలను ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాల చేనేత, జౌళిశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గద్వాల,

నారాయణపేట రకం చీరలకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మార్క్ లేబుల్ను అందిస్తుంది. ఈ లేబుల్ ఉన్న కార్మికులకు ఏడాదికి 18వేలు, అనుబంధ కార్మికులకు ఆరు వేల రూపాయల సహాయాన్ని అందిస్తుంది. గతంలో ఉన్న నేతన్నకు చేయూత పథకాన్ని తెలంగాణ నేతన్న పొదుపు పేరుతో అమలు చేయనున్నారు. గతంలో మూడేళ్ల కాల వ్యవధి ఉన్న ఈ పథకాన్ని ప్రస్తుతం రెండేళ్లకు తగ్గించారు. దీని వల్ల 11 వేల మందికి పైగా చేనేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుంది. కాగా, చేనేత కార్మికుల కోసం ఇప్పటికే ప్రకటించిన జీవిత కాల ఉచిత బీమా పథకం అమలుకు ప్రభుత్వం తొమ్మిది కోట్ల రూపాయలు కేటాయించింది. 18 సంవత్సరాలు నిండిన కార్మికులు ఏ కారణం చేత మరణించినా వారి కుటుంబాలకు 5 లక్షలు చొప్పునా బీమా అందిస్తారు. 59 ఏళ్ల లోపు వారికి ఎల్ఐసీ ద్వారా, ఆపై వయసున్న వారికి టెస్కో ద్వారా ఎక్స్గ్రేషియా చెల్లిస్తారు.

(DESK)

------------------------

**యాడ్ చేనేత**

తెలంగాణ చేనేత అభయ హస్తంలోని హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నేత కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. సిరిసిల్ల, వెములవాడ మొదలై చోట్ల ముఖ్యమంత్రి రేవంత్ పెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.

**పీటీసీ-ఆర్ఎస్**

------------------------

**బీఆర్ఎస్ యాదాద్రి**

భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంపై నిన్న జరిగిన దాడి నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ రోజు నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రహదారులపైన గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు రోడ్ల మీద కనిపిస్తే అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్నారు. భువనగిరికి చేరుకున్న మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే రామన్నపేటలో పార్టీ నాయకులు బడుగుల లింగయ్య యాదవ్ ను భువనగిరి రాకుండా అదుపులోకి తీసుకున్నారు.

**పీటీసీ**

---------------------------------

**బుక్ రిలీజ్**

మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు రచించిన “ఉనికి” అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఒడిశా గవర్నర్ కె. హరిబాబు, కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, బీజేపీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కె. సక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డెస్క్

------------------------------

**స్వామి వివేకానంద**

ఈ రోజు స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నారు. వివేకానంద 162వ జయంతి సందర్భంగా పలుచోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన బోధనలు స్మరించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని తమ నివాసంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కామారెడ్డిలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర స్థాయి యువజన దినోత్సవాలలో పాల్గొన్న 100 మంది యువతీ యువకులకు జిల్లా యువజన,క్రీడల అధికారి కేఎస్.జగన్నాథన్ ధృవపత్రాలను అందజేశారు.

వివేకానంద జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం ఖిలా వరంగల్ క్రీడా మైదానంలో జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత వరంగల్ లక్ష్యంతో 2k రన్ ను నిర్వహించారు. ఖిలా వరంగల్ క్రీడా మైదానం నుండి కుష్మహల్ వరకు జరిగిన 2k రన్ లో యువత మత్తు వదలరా మిత్రమా అంటూ ప్లకార్డులను పట్టుకుని ఉత్సాహంగా రన్ లో పాల్గొన్నారు.

మంచిర్యాలలో వివేకానంద విగ్రహానికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. మందమర్రి సింరేణి ఏరియాలో సంస్థ జనరల్ మేనేజర్ దేవేందర్ క్రీడా పోటీలు ప్రారంభించారు.

**PTC'S**

------------------------

**సంక్రాంతి రద్దీ**

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి నెలకొంజి. హైదరాబాద్ తో సహా నగరాల నుంచి ప్రజలు సొంత ఉళ్లలో పండుగ జరుపుకునేందుకు తరలివెళుతున్నారు. సొంత ఊళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో హైదరాబాద్ లోని ప్రధాన బస్టాండ్లలో రద్దీ నెలకొంది. టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు వేసినప్పటికి అవి సరిపోక ప్రజలు ప్రవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు కూడా ప్రయాణికులతో కిటికిటలాడుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. కాగా జంట నగరాల నుంచి అనేక మంది రాష్ట్రంలోని, ఆంధ్రప్రదేశ్ లోని స్వస్థలాలకు తరలి వెళ్తుండడంతో నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గింది. హైదరాబాద్ లో కూడా సంక్రాంతి కోలాహలం నెలకొంది. దుకాణాలు, షాపింగ్ మాల్స్, స్వీట్ స్టాల్స్ పండుగ కొనుగోళ్లతో రద్దీగా కనబడుతున్నాయి. హైదరాబాద్ శిల్పారామంలో రేపటి నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. మరోవైపు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో రేపటి నుంచి మూడు రోజుల పాటు గాలి పటాలు, తీపి

తినుబండారాల ఉత్సవం నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కైట్ పెస్టివల్ లో పాల్గొనేందుకు ఔత్సాహికులు పేర్లు నమోదు చేసుకున్నారు.

**డెస్క్**

--------------------------------------

**నల్గొండ**

నల్గొండ జిల్లాలో పోలీసులు అందిస్తున్న సేవలపై ప్రజలు క్యూ ఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలు తెలియజేసేందుకు సీటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూ ఆర్ కోడ్ కలిగిన పోస్టర్ ను జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శరత్ చంద్ర ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ పోస్టర్ అందుబాటులో ఉంటుందని, ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చునని ఆయన చెప్పారు.

**పీటీజీ నల్గొండ**

-----------------------------

**జమ్మికుంట మున్సిపాలిటీ**

2024-25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీల పన్ను వసూళ్లలో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ సంవత్సరానికి మార్చి 31 వరకు గడువున్నా, జమ్మికుంట మున్సిపాలిటీ ఇప్పటికే 64 శాతం ఆస్తి పన్నులు వసూలు చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో కొనసాగుతోంది.

**(PTC-KNR)**

-----------------------------

**గండి**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు కాల్వకు గండి పడడంతో నీటి ప్రవాహానికి గ్రామంలోని పంట పొలాలు మునిగిపోగ ఇళ్లలో కూడా నీరు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**పీటీసీ కరీంనగర్**

-----------------------------